## భారత్ నుంచి ఇజ్రాయెల్‌కు 10,000 మంది కార్మికులు

న్యూఢిల్లీ: మన దేశం నుంచి 10,000 మంది భవన నిర్మాణ కార్మికులు వచ్చే వారం వేర్వేరు బృందాలుగా ఇజ్రాయెల్‌కు వెళ్లబోతున్నారు. ఒక్కో బృందంలో సుమారు 700 నుంచి 1,000 మంది వరకు ఉంటారని ఇజ్రాయెల్ బిల్డర్స్ అసోసియేషన్ వర్గాలు ఓ వార్తా సంస్థకు తెలిపాయి. హమాస్ ఉగ్రవాద సంస్థతో యుద్ధం వల్ల ఇజ్రాయెల్‌లో ఉద్యోగులు, కార్మికుల కొరత తీవ్రంగా ఉంది. ఇజ్రాయెల్‌లో ఉన్న కార్మికులు తమ స్వస్థలాలకు వెళ్లిపోవడం వల్ల కార్మికుల కొరత ఏర్పడింది. దీంతో నిర్మాణ రంగంలో విదేశీ కార్మికుల కోటాను 30,000 నుంచి 50,000కు ప్రభుత్వం పెంచింది.

## అవినీతి కేసులో ఇమ్రాన్‌కు 14 ఏండ్ల జైలు

ఇస్లామాబాద్: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తోషఖానా అవినీతి కేసులో ఇమ్రాన్ ఖాన్, ఆయన సతీమణి బుష్రా బీబీకి కోర్టు బుధవారం 14 ఏండ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. ఇప్పటికే జైలులో ఉన్న ఆయనకు అధికార రహస్యాలు వెల్లడించిన కేసులో మంగళవారం 10 ఏండ్ల జైలు శిక్ష పడింది. అది జరిగిన కొన్ని గంటల వ్యవధిలోనే తోషఖానా కేసులో ఈ శిక్ష విధించడంతో ఆయన రాజకీయ జీవితం ముగిసినట్టేనని భావిస్తున్నారు.

## నోబెల్ శాంతి బహుమతికి మరోసారి ట్రంప్ నామినేట్

న్యూయార్క్, జనవరి 31: ప్రపంచ దేశాల మధ్య సౌభ్రాతృత్వం, శాంతి పెంపునకు విశేషంగా కృషి చేసిన వారికి ఇచ్చే నోబెల్ శాంతి బహుమతి కోసం అమెరికా మాజీ ప్రధాని డొనాల్డ్ ట్రంప్ పేరును రిపబ్లికన్ పార్టీ మరోసారి నామినేట్ చేసింది. ఆయన అధ్యక్షుడిగా ఉన్న సమయంలో అబ్రహం అకార్డ్స్ ఒప్పందంతో పాటు ఇజ్రాయెల్, బహ్రెయిన్, యూఏఈ మధ్య సంబంధాలను మెరుగుపరిచినందుకు ఆయనకు నోబెల్ బహుమతి ఇవ్వాలంటూ కోరారు. నోబెల్ బహుమతికి ట్రంప్ పేరును నామినేట్ చేయడం ఇది నాలుగోసారి.

## బోర్డులపై 60% కన్నడ ఆర్డినెన్స్.. తిప్పి పంపిన గవర్నర్

బెంగళూరు, జనవరి 31: దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేసే బోర్డులపై 60 శాతం కన్నడ ఉండాలంటూ కర్ణాటక ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను గవర్నర్ తిప్పి పంపారు. తొలుత ఈ ఆర్డినెన్స్ స్థానంలో బిల్లును తీసుకొచ్చి అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించాలని గవర్నర్ సూచించినట్టు సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం శివకుమార్ చెప్పారు. కన్నడ భాషను కాపాడుకోవడానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు.

## ఆర్మీని కించపరిస్తే ఆస్తులు జప్తు: రష్యా

మాస్కో, జనవరి 31: దేశ మిలటరీ గురించి తప్పుడు ప్రచారం చేసేవారిపై రష్యా కన్నెర్ర చేసింది. దేశంలోని మిలటరీ గురించి ఉద్దేశపూర్వకంగా నకిలీ, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసిన వారి ఆస్తులు, ఇతర ఖరీదైన వస్తువులను స్వాధీనం చేసుకోనుంది. ఈ మేరకు రష్యా పార్లమెంట్ దిగువ సభలో బుధవారం ఒక బిల్లును ఆమోదించారు. డ్యూమాలో బిల్లుకు సభ్యులు ఆమోదం తెలపడంతో దానిని ఎగువ సభకు, అధ్యక్షుడు పుతిన్ సంతకం కోసం పంపారు. ఈ సందర్భంగా డ్యూమా స్పీకర్ వ్యాచెస్లావ్ వొలోడిన్ మాట్లాడుతూ ఎవరైతే తీవ్రవాద కార్యక్రమాలను బహిరంగంగా ప్రోత్సహించినా, అలాంటి కార్యక్రమాలు చేపట్టాలని ప్రేరేపించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ ఉపవాసం

లండన్, జనవరి 31: బ్రిటన్ ప్రధానమంత్రి, భారత సంతతికి చెందిన రిషి సునాక్ తన ఆరోగ్య రహస్యాన్ని వెల్లడించారు. వారానికి తాను 36 గంటలపాటు ఉపవాసం ఉంటానని చెప్పారు. ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి మంగళవారం ఉదయం 5 గంటల వరకు ఘన పదార్థాలు తిననని తెలిపారు. ఈ ఉపవాసం సమయంలో నీళ్లు, చాయ్, బ్లాక్ కాఫీ మాత్రమే తాగుతానని పేర్కొన్నారు.

## అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో జోక్యం చేసుకోం: జిన్‌పింగ్

బీజింగ్, జనవరి 31: ఈ ఏడాది జరుగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో జోక్యం చేసుకోబోమని ఆ దేశ అధ్యక్షుడు బైడెన్‌కు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ హామీ ఇచ్చారు. కొద్ది రోజుల కిందటే ఈ హామీ ఇచ్చినప్పటికీ తాజాగా మళ్లీ ఈ విషయం చర్చకు వచ్చింది. అమెరికా భద్రతా సలహాదారు, చైనా విదేశాంగ మంత్రి మధ్య జరిగిన చర్చల సందర్భంగా జిన్‌పింగ్ హామీ తెరపైకి వచ్చింది. ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామని చైనా విదేశాంగ మంత్రి తెలిపారు.

# ఉద్యోగులపై విప్రో వేటు!

**వందల మందికి ఉద్వాసన**

- 12 వేల మందిపై యూపీఎస్ వేటు!
- పేపాల్‌లో 2,500 మంది ఇంటికి
- కొత్త ఏడాదిలోనూ భారీగా కోతలు

న్యూఢిల్లీ, జనవరి 31: ఉద్యోగాల ఊచకోత కొత్త ఏడాదిలోనూ కొనసాగుతున్నది. ఆ రంగం.. ఈ రంగం అనే తేడా లేకుండా కంపెనీలు భారీ సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తున్నాయి. దిగ్గజ కంపెనీల నుంచి స్టార్టప్‌ల వరకూ అన్ని టెక్ కంపెనీలు ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతున్నాయి. ఆర్థిక మాంద్యం భయాలు, ఖర్చులు తగ్గింపు, ఆదాయాలు మెరుగుపర్చుకొనే ప్రణాళికలో భాగంగా వేలాది మంది ఉద్యోగులను ఇంటికి పంపుతున్నాయి. ఇప్పటికే ఆ జాబితాలో మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ సంస్థలు ఉండగా.. తాజాగా యునైటెడ్ పార్సిల్ సర్వీస్(యూపీఎస్), ఫిక్ టెక్ సంస్థ పేపాల్, ఐటీ కంపెనీ విప్రోలు తమ కంపెనీల్లో వేలాది మంది ఉద్యోగులను తొలగించనున్నట్టు ప్రకటనలు చేశాయి.





### లాభాలు పెంచుకొనేందుకు..

మధ్య స్థాయి ఉద్యోగులే లక్ష్యంగా ఐటీ సంస్థ విప్రో ఉద్యోగుల తొలగింపు చేపట్టనున్నట్టు ది ఎకనమిక్ టైమ్స్ వెల్లడించింది. తగ్గిన ఆదాయాలను మెరుగుపర్చుకొనే ప్లాన్‌లో భాగంగా వందలాది ఉద్యోగులుపై కంపెనీ వేటు వేయనున్నదని, తొలగింపుల ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని సంబంధిత వర్గాల సమాచారాన్ని ఉటంకిస్తూ పేర్కొన్నది. భారత్‌లోని అతిపెద్ద ఐటీ సంస్థల్లో విప్రోకు అతి తక్కువ లాభాలు ఉన్నాయని తెలిపింది. డిసెంబర్ త్రైమాసికంలో విప్రో లాభాలు 16 శాతం వద్ద ఉండగా.. ఇది టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ కంటే తక్కువ అని ఎకనమిక్ టైమ్స్ వెల్లడించింది.

### 9% ఉద్యోగులపై పేపాల్ వేటు

9 శాతం మంది ఉద్యోగులను(2,500 మంది) తొలగించనున్నట్టు పేపాల్ సీఈవో అలెక్స్ క్రిస్ తాజాగా ప్రకటించారు. సమర్థత, ఆటోమేషన్ వినియోగం, వ్యాపారాన్ని పెంచుకోవడంపై దృష్టి పెట్టాలని అనుకొంటున్నట్టు ఉద్యోగులకు పంపిన అంతర్గత మెమోలో ఆయన పేర్కొన్నట్టు బ్లూమ్‌బర్గ్ వెల్లడించింది. తొలగింపునకు సంబంధించి ఈ వారం చివర్లో తెలియజేస్తామని మెమోలో తెలిపారు. పేపాల్ ఇదివరకే దాదాపు 2 వేల మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికింది.

### ఖర్చుల తగ్గింపులో భాగంగా

ఆర్థిక సవాళ్లు, ఖర్చుల తగ్గింపులో భాగంగా 12 వేల మంది ఉద్యోగులను తొలగించనున్నట్టు యునైటెడ్ పార్సిల్ సర్వీస్(యూపీఎస్) ప్రకటించింది. వాల్ స్ట్రీట్ అంచనాల కంటే వార్షిక ఆదాయాలు తగ్గిన నేపథ్యంలో, దీనికి స్పందనగా ప్రత్యామ్నాయ వ్యూహాలు పరిశీలిస్తున్నట్టు పేర్కొన్నది. దాదాపు 100 కోట్ల డాలర్ల మేర ఖర్చులు తగ్గించుకోవాలని లక్ష్యం పెట్టుకొన్నట్టు యూపీఎస్ సీఈవో కరోల్ టోమ్ వెల్లడించారు. గత ఏడాది ఎదురైన ప్రతికూలతను అధిగమించాలని అనుకొంటున్నామని ఆయన తెలిపారు.


## వియత్నాంను ముంచిన మహిళ

- ***నకిలీ లోన్ ఖాతాలతో రూ.లక్ష కోట్లు స్వాహా***
- ***లబోదిబోమంటున్న వేలాది మంది బాధితులు***

*హనోయ్ (వియత్నాం), జనవరి 31: వియత్నాంలోని సైగన్ కమర్షియల్ బ్యాంక్ (ఎస్‌సీబీ)లో తన రిటైర్మెంట్ సేవింగ్స్ దాచుకున్న ఒక మాజీ నర్సు డబ్బు డ్రా చేయడానికి వెళ్లింది. బ్యాంక్ సిబ్బంది మాటలు విని ఆమె షాక్ తిన్నది. బ్యాంకులో డబ్బు లేదని, ఆమెకు చెందిన డబ్బు విత్ డ్రా చేయడానికి అనుమతించలేమంటూ బ్యాంక్ అధికారులు నిస్సహాయత వ్యక్తం చేశారు. ఇది ఆ ఒక్క నర్సు వ్యథ కాదు. వియత్నాంలోని వేలాది మంది ప్రజలు గత రెండేండ్లుగా తమ డబ్బులు అందక హాహాకారాలు చేస్తున్నారు. బ్యాంకుకు ఈ పరిస్థితి రావడానికి ఒకే ఒక్క మహిళ కారణమంటే ఆశ్చర్యం కలగక మానదు. ప్రాపర్టీ వ్యాపారవేత్త ట్రుయాంగ్ మై లాన్ వియత్నాం దేశంలో అతి భారీ బ్యాంక్ మోసానికి పాల్పడ్డారు. 12.5 బిలియన్ డాలర్లు (సుమారు రూ.లక్ష కోట్లు) ఇన్వెస్టర్ల సొమ్మును ఆమె కాజేసింది. బ్యాంకులో 90 శాతం వాటాదారైన ఆమె లక్షలాది నకిలీ లోన్ ఖాతాలు సృష్టించి కోట్లాది రూపాయలను రుణం పేరుతో కాజేసింది. తీరా ఆ మొత్తం తిరిగి వసూలు కాకపోవడంతో ఇప్పుడు బ్యాంకు దివాలా దిశగా ఉంది. దీంతో అందులో డబ్బులు దాచుకున్న ఖాతాదారులు దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నారు. తమ ఖాతాల నుంచి సొమ్మును కానీ, వడ్డీని కానీ 2022 నుంచి డ్రా చేసుకోలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 2019 నుంచి 2022 మధ్య ఆమె డ్రైవర్ 4.4 బిలియన్ డాలర్ల నగదును ఎస్‌సీబీ నుంచి తన ఇంటికి వాహనం ద్వారా తరలించినట్టు అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు 42 వేల మంది బాధితులను గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. హాంకాంగ్‌కు చెందిన ఒక ధనవంతుడైన వ్యాపారవేత్తను వివాహం చేసుకున్న ట్రుయాంగ్ మై లాన్ వియత్నాం 2022 జీడీపీలో మూడు శాతం విలువైన ఆస్తులు కలిగి ఉన్నారు.*

## దండకారణ్యంలో సొరంగ మార్గాలు

- **భద్రతాదళాల నుంచి తప్పించుకునేందుకు మావోయిస్టుల వ్యూహం**
- **మంగళవారం నాటి మావోయిస్టు దాడికి హిడ్మా భార్య నాయకత్వం!**



కొత్తగూడెం క్రైం, జనవరి 31: ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మావోయిస్టులు చేస్తున్న కార్యకలాపాల్లో ఓ కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. భద్రతా దళాల నుంచి తప్పించుకునేందుకు, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లేందుకు వీలుగా మావోయిస్టులు ఏకంగా సొరంగాలనే ఏర్పాటు చేసుకున్నారు. వాటిని మంగళవారం అక్కడి పోలీసులు గుర్తించి ఫొటోలు, వీడియోలను మీడియాకు విడుదల చేశారు. సొరంగాలు ఉన్న ప్రాంతం దండకారణ్యంలోని దంతెవాడ.. అని ప్రాథమికంగా తెలుస్తున్నది. ఒక్కో సొరంగం కొన్ని కిలోమీటర్ల దూరం ఉన్నట్లు సమాచారం. ఛత్తీస్‌గఢ్‌లోని ఇతర మావోయిస్టు ప్రభావిత జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లోనూ సొరంగాలు ఉన్నట్లు అక్కడి పోలీస్ వర్గాలు భావిస్తున్నాయి. మంగళవారం సుక్మా జిల్లా టేకులగూడ సీఆర్పీఎఫ్ క్యాంప్‌పై మావోయిస్టులు మెరుపుదాడి చేసి ముగ్గురు జవాన్లను పొట్టనపెట్టుకున్న సంగతి తెలిసిందే. దాడి వెనుక మోస్ట్ వాంటెడ్, మావోయిస్టు మాస్టర్ మైండ్ హిడ్మా హస్తం ఉందని, మంగళవారం జరిగిన మెరుపు దాడికి హిడ్మా భార్య రాజక్కనే నాయకత్వం వహించిందనే అనుమానాలు తెరమీదకు వచ్చాయి. ఘటనలో రాజక్క తీవ్రంగా గాయపడి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

## 16వ ఆర్థిక సంఘం సభ్యులుగా నలుగురు నియామకం

న్యూఢిల్లీ, జనవరి 31: బ్యాంకింగ్, ఆర్థిక సేవల్లో అపార అనుభవం కలిగిన నలుగురిని 16వ ఆర్థిక సంఘం ఫుల్‌టైమ్ సభ్యులుగా నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదేశాలు జారీచేశారు. నీతి ఆయోగ్ మాజీ వైస్ చైర్మెన్ అరవింద్ పనగరియా 16వ ఆర్థిక సంఘం చైర్మన్‌గా గత ఏడాది డిసెంబర్‌లో నియమితులయ్యారు. మిగతా సభ్యులుగా.. కేంద్ర మాజీ కార్యదర్శి ఏఎన్ ఝా, మాజీ బ్యూరోక్రాట్ అన్నీ జార్జ్ మాథ్యూ, ఎస్‌బీఐ గ్రూప్ చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్ సౌమ్యకాంతి ఘోష్, అర్థ గ్లోబల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిరంజన్ రాజాధ్యాక్షలను నియమిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది.

## ఐఐఎంసీకి డీమ్డ్ విశ్వవిద్యాలయం హోదా

న్యూఢిల్లీ: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ (ఐఐఎంసీ)కి డీమ్డ్ టు బి యూనివర్సిటీ హోదా లభించింది. 58 ఏళ్ల నుంచి ఐఐఎంసీ అందిస్తున్న జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ కోర్సులు ప్రజాదరణ పొందుతున్నాయి. ఇకపై కేవలం డిప్లొమాలు మాత్రమే కాకుండా డిగ్రీలను ఇచ్చేందుకు ఈ సంస్థకు అధికారం కల్పించినట్లు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ప్రకటించింది. కొత్తగా లభించిన హోదా వల్ల డాక్టొరల్ ప్రోగ్రామ్స్‌ను కూడా ఈ సంస్థ ఆఫర్ చేయవచ్చు.

## రెండు ఎంఫిల్ కోర్సుల వ్యాలిడిటీ పొడిగింపు

న్యూఢిల్లీ, జనవరి 31: ఎంఫిల్ క్లినికల్ సైకాలజీ, సైకియాట్రిక్ సోషల్ వర్క్ కోర్సుల వ్యాలిడిటీని 2025–26 విద్యా సంవత్సరం వరకు పొడిగిస్తూ యూజీసీ నిర్ణయం తీసుకుంది. పీహెచ్‌డీ డిగ్రీకి సంబంధించి యూజీసీ 2022 నుంచి కొత్త నిబంధనల్ని అమల్లోకి తీసుకొచ్చింది. అయితే, మానసిక ఆరోగ్య సేవల్లో క్లినికల్ సైకాలజిస్టులు, సైకియాట్రిక్ సోషల్ వర్కర్ల ప్రాధాన్యతను గుర్తిస్తూ.. రెండు ఎంఫిల్ కోర్సులకు నిబంధనల నుంచి మినహాయింపు కల్పిస్తూ తాజాగా ఒక ప్రకటన విడుదల చేసింది.

